క్లుప్తంగా

డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు..!

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిసై బంగారంలాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) భవానీపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ సూచించారు. డీసీపీ మోకా సత్తిబాబు ఆదేశాల మేరకు గొల్లపూడిలోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీలో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై 'డ్రగ్స్ వద్దు..జీవితం ముద్దు' పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలతో ఆరోగ్యంపై చూపించే దుష్ప్రభావాల గురించి యువత విద్యార్థులను కలుపుకుని విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటుపడి మీతో పాటు మీ కుటుంబానికి సమాజంలో తలవంపులు తీసుకురావద్దని హెచ్చరించారు. గంజాయికి అలవాటు పడిన కళాశాలల విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఒక కంట కనిపెట్టి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని కోరారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్), నాటు సారాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా అటువంటి వారిని అరెస్ట్ చేసి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నైజాంగేటు రెహమాన్ వీధికి చెందిన సయ్యద్ అక్బర్‌కు నలుగురు సంతానం. అక్బర్ వ్యాపారం చేస్తుండగా, ఇద్దరు కుమారులు సహాయంగా ఉంటారు. ఈ నెల 21న చిన్న కుమారుడు సయ్యద్ హర్షద్ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన అక్బర్ బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్ రావునగర్‌కు చెందిన శీలగౌరీకి 2020లో ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన మేండ్రగుత్తి బాలరాజుకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నం, ఇతర లాంఛనాలు అందించారు. వివాహం అయిన కొద్ది రోజుల తర్వాత భర్త, అత్త, ఆడపడుచులు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి వచ్చింది. గౌరీని కాపురానికి తీసుకెళ్లకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరి అరెస్ట్

ఆటోనగర్(విజయవాడతూర్పు): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పటమట పోలీసులు అరెస్టు చేశారు. పటమట తోటావారివీధిలో నివాసముండే బాలికను అదే ప్రాంతానికి చెందిన సలీం అనే యువకుడు గతేడాది నవంబర్‌లో బాలికకు మాయమాటలు చెప్పి భూమిక అనే మహిళ సహకారంతో తన నివాసానికి తీసుకువెళ్లి పలు మార్లు లైంగిక వేధింపులకు గురిచేశాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితులను బుధవారం తోటవారివీధిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంముందు హాజరుపరిచారు.

అర్హులకు పథకాలు అందించేందుకే 'గడప గడపకు'

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి, తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అర్హులైన చివరి వ్యక్తి వరకు పథకాలు అందించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతోందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నగర పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. విజయవాడ నగరాన్ని ఓ మంచి నగరంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. భవానీపురం 42వ డివిజన్‌లోని 125వ సచివాలయం పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి గడప గడపకు పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మూడేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డులో ఓల్డ్ ఎంఐజీ కాలనీలో పర్యటించామన్నారు. ఇది పూర్తిగా పల్లపు ప్రాంతమన్నారు. ఈ కాలనీలో ఇళ్లన్నీ లోతట్టులో ఉంటాయన్నారు. రోడ్లు ఎత్తులో ఇళ్ల పల్లంలో ఉండడంతో కొద్దిపాటి వర్షానికి ఇళ్లలోకి నీరు చేరుతోందన్నారు. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో నీటిని మోటార్ల సహాయంతో తోడే బయటకు పంపే మార్గం ఉందేమో చూడమని కార్పొరేషన్ అధికారులకు చెప్పడం జరిగిందన్నారు.

పార్కులను అందుబాటులోకి తెస్తాం

డివిజన్‌లో పార్కు స్థలాలు ఎక్కువగా ఉన్నాయని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. వీటన్నింటిని ఆధునికీకరించి స్థానికులకు పార్కులను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. పార్కులు కాలనీ వాసులే నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సచివాలయ పరిధిలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. అవకాశాలన్నింటిని వినియోగించుకుని డివిజన్ అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు నూటికి నూరు శాతం అందుతున్నాయన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా పథకాలు అందకపోతే వాటిని కూడా సరిచేయాలని అధికారులకు సూచించామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

ఆలయాల ముందు అబద్ధాలు ఆడిన వ్యక్తి పవన్ కళ్యాణ్

దేవాలయాలకు వెళితే ఎవరైనా దేవుడు, భక్తి, పుణ్యం ఇటువంటి విషయాలు మాట్లాడుకోవాలని, కానీ పవన్ కళ్యాణ్ అక్కడ కూడా రాజకీయాలకు సంబంధించి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి ధ్వజమెత్తారు. ఆయన పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. పొత్తులు పెట్టుకునే పార్టీ కూడా ఒక రాజకీయ పార్టీయేనా అని ప్రశ్నించారు. 'నేను 175 నియోజకవర్గాల్లో పోటీ చేస్తాను. ముఖ్యమంత్రిని అవుతాను. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాను. ఈ ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తాను. అని చెప్పే ధైర్యం పవన్‌కు లేదన్నారు. ఎప్పుడూ చూసిన ఎవరితో పొత్తులు పెట్టుకుందాం. ఎప్పుడెపుడు చంద్రబాబు దగ్గర ప్యాకేజీ తీసుకుందామన్న ఆలోచనే తప్ప పవన్‌కు మరొకటి లేదని' దుయ్యబట్టారు. చంద్రబాబు జపమే తప్ప జెండా, ఎజెండా లేదన్నారు. విధివిధానాలు, విజన్ లేకుండా ప్యాకేజీ కోసమే పెట్టిన పార్టీ జనసేన పార్టీ అని ఎద్దేవా చేశారు. వారాహి ఉత్సవాలకే పవన్‌కు టైం సరిపోవడం లేదన్నారు. దత్త తండ్రి చంద్రబాబు గుంటూరు, కందుకూరులో ప్రజలను చంపితే, పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రజలను పొట్టన పెట్టుకున్నాడన్నారు. జనాలను చంపడానికే యాత్రలు చేస్తున్నారని వెలంపల్లి విమర్శించారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నగరపాలక సంస్థ, రెవెన్యూ, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు, తేనీటి విందుకు బందోబస్తు



అడిషనల్ డీజీ రవిశంకర్‌అయ్యర్‌కు బందోబస్తు వివరాలు వెల్లడిస్తున్న సీపీ రాణా

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే గణతంత్ర వేడుకలు, రాజ్ భవన్‌లో జరిగే తేనీటి విందు కార్యక్రమాలకు 1,600 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఈ రెండు ప్రాంతాలను బుధవారం పరిశీలించిన అడిషనల్ డీజీలు రవిశంకర్‌అయ్యర్, డాక్టర్ శంకబ్రటబగ్చిలకు బందోబస్తు వివరాలను సీపీ రాణా వివరించారు. గణతంత్ర వేడుకలకు ఈ ఏడాది 400 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండానే వాహన రాకపోకలు దారి మళ్లిస్తున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు పారిశుద్ధ్య సమస్యను వివరిస్తున్న స్థానికురాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ)/పటమట(విజయవాడతూర్పు): డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం అధికారులతో కలిసి సర్కిల్–1 పరిధిలో గల 44, 51 డివిజన్లలోని విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్, వాగు సెంటర్, నెహ్రూ బొమ్మ సెంటర్ తదితర వీధులు, కొండ ప్రాంతంలో పర్యటించారు. ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ విధానం, స్థానిక సమస్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండ ప్రాంతవాసులకు రోడ్లు, డ్రెయిన్లు, మెట్లు, తాగునీటి సరఫరా తదితర వసతులపై ఆరా తీశారు. స్థానికులు ఇకపై చెత్తాచెదారం కాలువల్లో పడేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దటంతో పాటు మెట్ల మార్గంలోగల వాటర్ పైప్‌లైన్లను కాంక్రీట్‌తో మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

అనంతరం ఆయన 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి కొత్తపేట కేటీరోడ్‌లో పూర్తి చేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ఇతర ఐఏఎస్ అధికారులు హాజరు కానున్న దృష్ట్యా అక్కడ ఏర్పాట్ల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు ఆదేశాలు ఇచ్చారు. కళాక్షేత్రం ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఏర్పాటు చేసిన మొక్కలను పరిశీలించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ పర్యటనలో కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, జోనల్ కమిషనర్–1 కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యనారాయణమూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి పరిశీలన

నగర పరిశుభ్రతలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు మురుగు కాల్వల నిర్వహణ కూడా సక్రమంగా జరగాలని స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్), కె.సత్యవతి, మలేరియా–6 పరిధిలోని గాంధీనగర్ సత్యనారాయణపురం ఏరియాలో పర్యటించి మురుగు కాలువల నిర్వహణ గురించి సూచనలు చేశారు. నూతన నిర్మాణాలు జరిగే ప్రదేశాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు డ్రెయిన్లలో పడి మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారుతున్నాయన్నారు. భవన నిర్మాణ యజమానులతో సంప్రదించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ సూర్యకుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పటమట 12వ డివిజన్‌లోని కృష్ణానగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బుధవారం రాత్రి జరిగింది. మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు కైలే అనిల్ కుమార్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వైఎస్సార్ సీపీ నేతలు దేవినేని అవినాష్, బొప్పన భవకుమార్, స్థానిక నాయకులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

ఉత్సాహంగా ఎకో వాక్



బోటులో వెళ్తున్న సందర్శకులు




భవానీ ద్వీపంలో వాకింగ్ చేస్తున్న వాకర్స్



సెల్ఫీ తీసుకుంటున్న పర్యాటకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన ఏడాది నుంచి వరుసగా నిర్వహిస్తున్న ఈవెంట్లతో పర్యాటకులు, సందర్శకులు ఆకర్షితులు కావడంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలో నూతనోత్సాహం నెలకొంది. అదే స్ఫూర్తితో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ భవానీ ద్వీపంలో పర్యావరణ పర్యాటకంలో భాగంగా ఏర్పాటు చేసిన 'ఎకో వాక్' వాకర్స్‌ను విశేషంగా ఆకట్టుకుంది. కృష్ణానది తీరాన ఆహ్లాదకరమైన పచ్చని పరిసరాల నడుమ ఉత్సాహభరితంగా సాగిన 'ఎకో వాక్'ను వాకర్స్ అసోసియేషన్ నిర్వహించగా విజయవాడ అడ్వంచర్ క్లబ్, సన్‌రైజ్ వాకర్స్ లయోలా కళాశాల, సన్‌రైజ్ వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్, వైహెచ్ఏఐ సభ్యులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ టూరిజం అథారిటీ ఎండీ, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ కె.కన్నబాబు మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక శాఖ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ టూరిజ ఆధ్వర్యంలో భవానీ ద్వీపంలో నిర్వహించిన ఎకో వాక్ అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం అథారిటీ డెప్యూటీ సీఈఓ వి.రాముడు, భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బలరాంరెడ్డి పాల్గొన్నారు. కాగా జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌లో వాక్‌ను జేసీ విశ్వనాథన్, టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ ప్రారంభించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బీచ్ క్లీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, అన్నమయ్య జిల్లాల్లో ఎకో వాక్స్, 3కె రన్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం పటిష్టత



కేబీఎన్ కళాశాలలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఓటు హక్కు వినియోగించుకోవటం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయటానికి అవకాశముంటుందని నగరపాలకసంస్థ డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి అన్నారు. కేబీఎన్ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని, వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా ప్రధానమైన పాత్ర పోషిస్తుందన్నారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటు ఆయుధంగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఓటు విశిష్టతను విద్యార్థులు తమ చుట్టూ ఉన్న ప్రజలకు తెలియజేసి వారిని జాగృతం చేయాలన్నారు.

మంచి పాలకులను ఎన్నుకోవాలి..

జోనల్ కమిషనర్ కేటీ సుధాకర్ మాట్లాడుతూ.. ఓటు హక్కుకు సంబంధించి విద్యార్థులు మరింత చైతన్యవంతంగా ఉండాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన, విస్తృతమైన ఎన్నికల వ్యవస్థ భారతదేశంలో ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థ యావత్ ఓటుపై ఆధారపడి ఉంటుందన్నారు. మంచి పాలకులను ఎన్నుకొని తద్వారా మంచి అభివృద్ధిని సాధించేందుకు ఓటు హక్కును చక్కగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఎక్కువ పర్యాయాలు ఓటు వేసిన సీనియర్ సిటిజన్‌ను సత్కరించారు. కొత్తగా ఓటు నమోదైన వారికి ఐడీ కార్డులను అందించారు. సభలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రామ్ ఆఫీసర్ వీఎస్ రావు స్వాగతం పలకగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి.పవన్‌కుమార్, ఎస్.సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలు సీఎం జగనన్న వెంటే ఉంటారు



శ్రీకాంత్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ మారేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని బీసీలను బలమైన నాయకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లకు మరోసారి అవకాశం కల్పించారని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. సీఎం జగనన్న, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతూ బీసీ మిత్రమండలి ఆధ్వర్యంలో విజయవాడలోని బీసీ సంక్షేమ భవన్‌లో బుధవారం ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. బీసీలు సీఎం జగనన్న వెంటే ఉంటారని చెప్పారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్ మారేష్ మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే తపన సీఎం జగనన్నలో ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఆర్టీసీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు, బీసీ నాయకులు పాండురంగారావు, డాక్టర్ మారేష్ శ్రీకాంత్‌ను సత్కరించి జ్ఞాపిక అందచేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు దుర్భేసుల హుస్సేన్, మాదాల తిరుపతిరావు యాదవ్, టీవీ రమణ, టి.పూర్ణయ్య, భ్రమరాంబ, గురునాథ్, దాడి జగన్, గౌర యువనాగరాజు, పుండరీకాక్ష, పఠాన్ కరీం ఖాన్ పాల్గొన్నారు.

ఎంజీ రోడ్డులో విద్యుత్ కాంతులు



విద్యుత్ వెలుగులో రైల్వే స్టేషన్



గణతంత్ర వెలుగులు

గణతంత్ర వేడుకలకు నగరం ముస్తాబైంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పార్కులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

నేడు ముస్లిం ఐక్యవేదిక బహిరంగసభ



మాట్లాడుతున్న రహీంఖాన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు రహీంఖాన్ చెప్పారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వన్‌టౌన్ ముసాఫిర్ ఖానా ప్రాంగణంలో గురువారం సాయంత్రం 5 గంటలకు ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ నగరంలోని ముస్లింలు, ముస్లిం సంఘాల నాయకులు, ముస్లిం మార్కెట్లు, అసోసియేషన్ల పాలకవర్గాలు హాజరవుతాయన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడ తూర్పు): గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం నగర వ్యాప్తంగా మాంసం విక్రయాలు బంద్ చేస్తున్నామని, కబేళా కూడా మూసేస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నగరంలోని అన్ని చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నింటికీ సెలవు ప్రకటించామన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ ఫౌండేషన్, మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. సూర్యారావుపేటలోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం స్కాలర్ షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ చైర్మన్ కిలారు స్వప్న మాట్లాడుతూ.. ఈచ్ వన్ హెల్ప్ వన్ అనే ఆశయంతో 2004లో కేఎస్ఎన్ ప్రసాద్ రూ.కోటి వ్యయంతో ఫౌండేషన్‌ను స్థాపించారన్నారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులతో కలిసి మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్(ఎంఓఎస్‌టీ)పేరుతో రూ.1.09 కోట్ల మూలధనంతో మరో ట్రస్ట్‌ను 2012లో స్థాపించారన్నారు. ఆనాటి నుంచి ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు అంజేస్తున్నామని చెప్పారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేఎస్ఎన్ మరణానంతరం ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామన్నారు. జనవరి 25న ప్రసాద్ జయంతి రోజున విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందులో భాగం కేఎస్ఎన్ ఫౌండేషన్, మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ తరపున 38 మంది విద్యార్థులకు రూ7.80 లక్షలు అందజేశామని చెప్పారు. మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని రంగప్రసాద్, సెక్రటరీ డాక్టర్ జాస్తి విజయకృష్ణ, జయరామ్, సి.రమేష్ పాల్గొన్నారు.